క్లుప్తంగా

యువశక్తితోనే దేశాభివృద్ధి



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ప్రతినిధులు

కదిరి అర్బన్: యువశక్తితోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని బ్లూమూన్ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మోగా జాబ్ మేళా నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు ఆర్డీఓ వీవీఎస్ శర్మ, బ్లూమూన్ విద్యాసంస్థల చైర్మన్ శివశంకర్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. జీతం తక్కువని ఆలోచించకుండా వచ్చిన ఉద్యోగ అవకాశంతో ముందడుగేస్తే జీవితంలో రాణిస్తారని పేర్కొన్నారు. విద్యార్థి ఏ రంగంలోనైనా రాణించే విధంగా విద్యావిధానం ఉండాలన్నారు. 385 మంది అభ్యర్థులను 25 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీరిలో ప్రతిభ కనబరచిన 182 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరిక్రిష్ణ తెలిపారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయాన్ని పరిశీలించిన డీఎస్పీ



కార్యాలయాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

గాండ్లపెంట: కదిరి డీఎస్పీ శివనారాయణ స్వామి మంగళవారం గాండ్లపెంట మండల పరిషత్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ నెల 27న మండల పరిషత్ అధ్యక్షుని ఎన్నిక నిర్వహించనున్న నేపథ్యంలో కార్యాలయం, పరిసరాలను పరిశీలించారు. డీఎస్పీ వెంట రూరల్ సీఐ నాగేంద్ర, ఎన్పీ కుంట ఎస్ఐ వలిబాషా, సిబ్బంది ఉన్నారు.

రేపు సంత, దుకాణాల వేలం

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో వారపు సంత, పంచాయతీ దుకాణాలకు గురువారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి మంగళవారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనొచ్చని సూచించారు.

పరిశుభ్రంగా ఉంచాలి

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి సమత అధికారులకు సూచించారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. చెత్తను పంచాయతీ ఏర్పాటు చేసిన తొట్టెల్లో మాత్రమే వేయాలని ప్రజలకు సూచించారు. తొట్టెల్లోని చెత్తను రెండుమూడు రోజులకోమారు చెత్తతో సంపద తయారీ కేంద్రానికి తరలించాలని పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామికి సూచించారు.

రైలు పట్టాలపై మృతదేహం

ముదిగుబ్బ: మలకవేమల క్రాస్ సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం ఉదయం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్ఐ రహీం అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. 50 నుంచి 56 సంవత్సరాల మధ్య వయసున్న వ్యక్తి సోమవారం రాత్రి ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారి కిందపడి మృతి చెందాడా? రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడా? అనే విషయం తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు.

ప్రశాంతంగా జీవించండి



గ్రామస్తులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ

గాండ్లపెంట: ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామమైన గజ్జలవాండ్లపల్లిలో మంగళవారం కదిరి రూరల్ సీఐ నాగేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామ పరిసరాలను సోదాలు చేశారు. అనంతరం సీఐ గ్రామస్తులతో మాట్లాడుతూ ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు గ్రామంలోకి వచ్చినా, గొడవలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వివాదాలకు పోకుండా ప్రశాంతంగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ తో పాటు ఎన్పీకుంట, తనకల్లు, తలుపుల ఎస్ఐలు వలిబాషా, గోపి, నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-కేవైసీ చేయించుకోండి

తాడిమర్రి: రేషన్‌కార్డుల్లోని సభ్యులు చాలా మంది ఈ-కేవైసీ చేయించుకోలేదని సీఎస్ డీటీ శారత పేర్కొన్నారు. డీలర్ల వద్ద ఈ-కేవైసీ పెండింగ్ జాబితా ఉందన్నారు. సదరు కార్డుదారులు డీలర్లను సంప్రదించి వేలిముద్రలు వేసి ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈ నెల 30లోపు ఈ-కేవైసీ చేయించుకోకుంటే ఏప్రిల్ నెల నుంచి బియ్యం కార్డులో పేర్లు తొలగిపోతాయన్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీ ఇంకెప్పుడు?

- గత ఖరీఫ్‌లో దారుణంగా దెబ్బతిన్న పంటలు
- ఆదుకుంటామని సర్కారు చెప్పినా నేటికీ అతీగతీ లేదు
- సాయం కోసం ఎదురుచూస్తున్న రైతులు



తుపాన్ కారణంగా తడిసిపోయిన వేరుశనగ పంట(ఫైల్)


ధర్మవరం రూరల్: ఖరీఫ్–2024లో పంట నష్టపోయిన రైతులు ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తామని ప్రకటన చేసి మిన్నకుండిపోయింది. రైతులను ఆదుకుందామన్న ధ్యాసే లేకుండా పోతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమి సర్కారు కొలువుదీరిన తర్వాత వ్యవసాయ రంగం క్రమేణా నిర్వీర్యమవుతోందని రైతులు అంటున్నారు. ఈసారి పెట్టుబడి సాయం (అన్నదాతా సుఖీభవ కింద రూ.20 వేలు) ప్రభుత్వం ఇవ్వకపోయినా విధిలేని పరిస్థితుల్లో అప్పులు చేసి రబీలో పంటలను సాగు చేసుకున్నామని చెపుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. వ్యవసాయ పనులు చేపట్టక ముందే రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేసి ఊరట కల్పించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని రైతులు మండిపడుతున్నారు. వ్యవసాయం దండగ అనే రీతిలో వ్యవహరిస్తోందని అంటున్నారు.

అరటి నష్టం నివేదికలతో సరిపెడతారా?

తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లో రెండు రోజుల క్రితం అరటి, దానిమ్మ, చీనీ, టమాట పంటలు ఈదురు గాలులు, వడగండ్ల వర్షానికి తీవ్రంగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా అరటి రైతులు లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి తీరా పంట చేతికందే సమయంలో అకాల వర్షాలకు భారీగా నష్టపోయారు. కంటి తుడుపుగా పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికలు ప్రభుత్వానికి పంపుతారా? లేక నివేదికలు అందిన వెంటనే రైతులకు నష్ట పరిహారాన్ని చెల్లిస్తారా? అని రైతులు అంటున్నారు. గత ఏడాది కూడా వేరుశనగ, కంది తదితర పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని మండలాల వారీగా ప్రకటించి నిధులు ఖాతాల్లోకి జమ చేయకపోవడంతో రైతుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఉగాదికైనా అందేనా?

దిగుబడి లేని కంది పంట (ఫైల్)



ధర్మవరం వ్యవసాయ డివిజన్‌లో ఖరీఫ్–2024లో వేరుశనగ, కంది, మొక్కజొన్న, జొన్న, కొర్రలు, ఆముదం, పెసలు, ఆముదం తదితర పంటలను సాగు చేశారు. అయితే వాతావరణంలో మార్పులు, అధిక వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. నష్టపోయిన పంటలను వ్యవసాయ సిబ్బంది ఈ–క్రాప్ నమోదు చేశారు. అయితే పంటలు సాగు చేసి ఈ– క్రాప్ చేయించుకున్న రైతులకు మాత్రమే ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని అప్పట్లో ప్రభుత్వం ప్రకటించింది. మండలాల వారీగా ఇన్‌పుట్ సబ్సిడీ కింద నిధులను కేటాయించారు గానీ.. నేటి వరకు ఖాతాల్లోకి జమ చేయలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఉగాదికైనా ప్రకటించిన ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తారా అని ఎదురు చూస్తున్నారు.

ఖరీఫ్ సాగు వివరాలు.. ఇన్‌పుట్ సబ్సిడీ సాయం ప్రకటన

మండలం	రైతులు	సాగు చేసిన విస్తీర్ణం ఎకరాలు	ప్రకటించిన నిధులు లక్షలు
ధర్మవరం	5831	16,276	రూ.923.16
తాడిమర్రి	2517	7,075	రూ.369.20
ముదిగుబ్బ	8531	21,712	రూ.1287.83
కనగానపల్లి	8396	23,360	రూ.706.96
రామగిరి	3992	13,000	రూ.1144.16

నివేదికలను ప్రభుత్వానికి పంపించాం

గత ఖరీఫ్‌లో వాతావరణ మార్పులు, అధిక వర్షాల కారణంగా పంటలకు నష్టం వాటిల్లింది. గ్రామాల వారీగా వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో ఈ– క్రాప్ చేశాం. జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలను పంపించాం. ఇన్‌పుట్ సబ్సిడీ ఎప్పుడు రైతుల ఖాతాల్లోకి వేస్తారన్న విషయం మాకు సమాచారం లేదు.

– ముస్తఫా, వ్యవసాయాధికారి, ధర్మవరం మండలం

ప్రజల కోసం కలిసి పనిచేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బగ్గిరి త్రివేణి

బత్తలపల్లి: ఎన్నికల వరకే రాజకీయాలు చేద్దాం.. ఇప్పుడు ప్రజల కోసం అందరూ కలసి పని చేద్దామని ఎంపీపీ బగ్గిరి త్రివేణి ప్రజా ప్రతినిధులకు సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చినా ఏమి ప్రయోజనమని దంపెట్ల సర్పంచ్ చల్లా కరుణాకర్‌నాయుడు ప్రశ్నించారు. గత సమావేశాల్లో ఏమి తీర్మానాలు చేశారు? జిల్లా అధికారులకు ఏమి పంపారు? ఆ సమస్యలను ఎంత వరకు పరిష్కరించారు? అనే విషయాలు ప్రజా ప్రతినిధులకు చెప్పలేకపోతే ఈ సమావేశాలు ఎందుకు అని నిలదీశారు. ఎంపీడీఓ నరసింహనాయుడు స్పందిస్తూ ఇకపై సమావేశం జరిగిన మూడు రోజులకు అధికారులకు పంపే తీర్మానాలు, తదితర విషయాలను తెలియజేస్తామన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ శాఖల ప్రగతిని వివరించారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత కరెంటు అని హామీలు ఇచ్చి ఇప్పుడు 200 యూనిట్లు వరకు మాత్రమే ఉచితమంటూ వారి కనెక్షన్లు కట్ చేయడం ఎంత వరకు సబబు అని పలువురు సభ్యులు ప్రశ్నించారు. పూరి గుడిసెలో ఉన్న వారికి సైతం 200 యూనిట్లు విద్యుత్ కాల్చినట్లు బిల్లులు వస్తున్నాయని, తక్షణమే మీటర్లు మార్చాలని పలువురు సర్పంచులు కోరారు. జెడ్పీటీసీ సుధ, ఎంపీడీఓ, ఎంపీపీ, ఏఓ శ్రీనివాసులు తదితరులు మాట్లాడారు. సమావేశంలో సర్పంచులు సానే జయచంద్రారెడ్డి, అక్కిం దామోదర్, ప్రభాకరరెడ్డి, బత్తినన్న, కోఆప్షన్ మెంబర్ కరీంసాబ్, ఎంపీటీసీ సభ్యులు, ఈఓఆర్డీ క్రిష్టప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జ్యోతి, వ్యవసాయాధికారి ఓబిరెడ్డి, పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి, ఏపీఓ ఆదెప్ప, సెరికల్చర్ అధికారి మస్తాన్‌రెడ్డి, ఎంఈఓ చాముండేశ్వరి, ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ, పంచాయతీ రాజ్ ఏఈ గాయత్రి, ఏఎస్ఐ తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు



ముత్యాలప్పను సన్మానిస్తున్న గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది

బత్తలపల్లి: ఉద్యోగులు ప్రజలకు అందించిన సేవలతోనే తగిన గుర్తింపు పొందుతారని వక్తలు పేర్కొన్నారు. పోట్లమర్రి గ్రామ సచివాలయంలో విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్ కురుబ చిత్రా ముత్యాలప్ప పదోన్నతిపై సెరికల్చర్ టెక్నికల్ అసిస్టెంట్‌గా పెనుకొండ డివిజన్‌లోని రొద్దం మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది ఆయన్ను మంగళవారం ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులుగా సర్పంచ్ అక్కిం దామోదర్, పట్టు పరిశ్రమ టెక్నికల్ అధికారి మస్తాన్‌రెడ్డి, వీఎస్ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమ్మన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూముత్యాలప్ప సేవలను కొనియాడారు. అనంతరం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది మంజునాథ్, దీప్తి, సాయి నిఖిత, ఆదిత్యలతో పాటు గ్రామస్తులు కమతం మోహన్, కమతం శివయ్య, బుత్రా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం



గొకనపేటలో మొగల్ మునీర్‌బాషాను పరామర్శిస్తున్న నాయకులు

ఎన్పీకుంట: మండలంలోని పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు టి.జగదీశ్వర్‌రెడ్డి మంగళవారం పరామర్శించి, పరామర్శించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇటీవల మృతి చెందిన మరికొమ్మదిన్నికి చెందిన ఎస్.మహబూబ్‌బాషా (36), జౌకల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సోషల్‌మీడియా యాక్టివిస్ట్ బుల్లెట్‌బాబా కుమార్తె తహరీమ్ (8)కు సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. చయ్యప్పగారిపల్లిలో ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త దుద్దుకుంట వెంకటరెడ్డి తల్లి సత్యమ్మను, గొకనపేటలో రోడ్డుప్రమాదంలో గాయపడి ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న మొగల్ మునీర్‌బాషాను పరామర్శించారు. ఎస్.మహబూబ్‌బాషా, మొగల్ మునీర్‌బాషా కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కొత్తరంగారెడ్డి, ఎంపీటీసీ తిమ్మారెడ్డి, తిరుమలనాయుడు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అంజన్‌రెడ్డి, స్థానిక నాయకులు ఓబుళరెడ్డి, మౌలా, వెంకటరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ తరగతులు ఉదయం పూట నిర్వహించాలి



ఇంటర్ విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న అధ్యాపకులు

పుట్టపర్తి టౌన్: ఇంటర్మీడియెట్ తరగతులు ఉదయం పూట నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి రఘునాథ్‌రెడ్డిని జూనియర్ కాలేజీ అధ్యాపకుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు కొత్తచెరువులోని తమ కార్యాలయంలో జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ రెండవ సంవత్సరం విద్యార్థులకు తరగతులు నిర్వహించాలని ఇంటర్ బోర్డు నిర్ణయించిందన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున విద్యార్థులు, అధ్యాపకులు హాజరుకావడం చాలా ఇబ్బందిగా ఉంటుందని, అందువల్ల ఉదయం పూట తరగతులు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యాపకుల సంఘం నాయకులు పెద్దన్న, కేశవరెడ్డి, హఫీజ్‌ఖాన్, శంకరప్ప, అంజలి, శ్రీదేవి, సుజాత, లలిత, క్రిష్ణయ్య, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సానేవారిపల్లిలో 'పొలం బడి'



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న అధికారులు

ముదిగుబ్బ: మండలంలోని సానేవారిపల్లి, మంగళమడక గ్రామాల్లో మంగళవారం ఇండిగ్యాప్ పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ముదిగుబ్బ ఎఫ్‌పీఓలో సభ్యత్వం ఉన్న 11 మంది రైతుల పొలాలను ఏపీఎస్ఓపీసీఏ గుంటూరు ఎక్స్‌టర్నర్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రవి, జిల్లా ఎవాల్యూయేటర్ బి.వెంకటేష్, ఏఓ లక్ష్మీనరసింహులు తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా మేలైన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఎరువుల వాడకం, విత్తన ధ్రువీకరణ ప్రాముఖ్యత తదితర వాటి గురించి వివరించారు. విత్తన నమూనాలను సేకరించి పురుగుమందుల అవశేషాల నిమిత్తం ల్యాబ్‌కు పంపుతామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ షరీఫ్, ఎఫ్‌పీఓ లక్ష్మీదేవి, ఏపీఎం హేమలత, ఎంపీఈఓలు నాగరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: పెండింగ్‌లో ఉన్న మూడు డీఏల్లో రెండు వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పుట్టపర్తిలోని సంఘం కార్యాలయంలో తాలూకా సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. 12వ పీఆర్‌సీ కమిటీ చైర్మన్ నియామకం ఆలస్యమైనందున ఐఆర్‌ను ప్రకటించాలని తీర్మానించారు. కార్యక్రమంలో తాలూకా అధ్యక్షులు లక్ష్మీనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణ, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రానాయక్, నాగసురేష్, మల్లికార్జున, చంద్ర, కార్యదర్శి రాంప్రసాద్, జాయింట్ సెక్రటరీలు రమణ, భాస్కర్‌రెడ్డి, మోహన్, కుమార్, ఫక్రొద్దీన్, ట్రెజరర్ నిరంజన్‌రెడ్డి లక్ష్మయ్య, కాలమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్నుపై 50 శాతం వడ్డీ రాయితీ

ధర్మవరం: మున్సిపాలిటీ పరిధిలోని ఆస్తి పన్ను, ఖాళీ జాగా పన్ను బకాయిలను ఈ నెల 31లోపు ఒకేసారి చెల్లిస్తే వడ్డీలో 50 శాతం రాయితీ వర్తిస్తుందని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయం, ఎల్‌పీ సర్కిల్ అన్న క్యాంటీన్ పక్కనున్న సచివాలయం, పార్థసారథి నగర్–2 సచివాలయం, ఆన్‌లైన్ ద్వారా ఆస్తి పన్ను బకాయిలు చెల్లించవచ్చని తెలిపారు.

సకాలంలో పన్నులు చెల్లించండి

పుట్టపర్తి టౌన్: ఆస్తి, ఇంటి పన్నులను సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ప్రహల్లాద పేర్కొన్నారు.

అనాథలకు ప్రాధాన్యత ఇవ్వాలి

ఎన్పీకుంట: కేజీబీవీ అడ్మిషన్లలో తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు ప్రాధాన్యత కల్పించాలని బీజేపీ మండల అధ్యక్షుడు షేక్ బాబ్జాన్ (గుజిరి) ప్రిన్సిపాల్ రిహానాను మంగళవారం కోరారు. విద్యాశాఖ నిబంధనల మేరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటే అర్హతలను బట్టి సీట్లు కేటాయిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

భక్తి మార్గంలో పయనించండి



స్వామీజీకి స్వాగతం పలుకుతున్న ప్రముఖులు

ధర్మవరం అర్బన్: ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో పయనించాలని శ్రీ త్రిదండి అష్టాక్షరి సంపత్‌కుమార్ రామానుజ జీయర్‌స్వామి సూచించారు. కర్నూలులో వారం రోజులపాటు జరుగుతున్న శ్రీరామ పూజల నిమిత్తం వెళ్లే మార్గంలో ధర్మవరానికి విచ్చేసిన స్వామీజీకి పట్టణ ప్రముఖులు కోటి లక్ష్మీవెంకటేశ్వర్లు, దేవతా కృష్ణమూర్తి, నాగానంద, పిన్ను ప్రసాద్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం వాసవి భజన మందిరంలో స్వామీజీకి ప్రత్యేక పూజలు చేశారు. స్వామీజీ మాట్లాడుతూ దైవాజ్ఞ లేనిదే మనిషి ఎటువంటి విజయమూ సాధించలేరని తెలిపారు. ప్రజలందరూ భక్తి మార్గంలో నడిచినప్పుడే మంచి జీవితం లభిస్తుందన్నారు. విద్యార్థి దశ నుంచే పిల్లలకు దేవునిపై భక్తి పెరిగేలా తల్లిదండ్రులు అలవాటు చేయాలని తెలిపారు. చదువుతోపాటు భగవద్గీత, రామాయణం కూడా నేర్పించాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం

ద్విచక్ర వాహనం అపహరణ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని విలేకరుల కాలనీలో ఇంటి ముందు పార్క్‌చేసిన ద్విచక్రవాహనం సోమవారం అర్ధరాత్రి అపహరణకు గురైంది. ఈ మేరకు బాధితుడు దేగల రవికుమార్ మంగళవారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కనగానపల్లి: స్థానిక కస్తూర్బా బాలికా విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి, ఇంటర్ ప్రవేశం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నరసమ్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థినులు ఏప్రిల్ 11 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

చెత్తదిబ్బకు ఆకతాయిల నిప్పు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని వైఎస్సార్‌కాలనీలో మంగళవారం చెత్త దిబ్బకు ఆకతాయిలు నిప్పు పెట్టారు. ఆ మంటలు పక్కనే ఉన్న తోట కంచెకు వ్యాపించాయి. దీంతో కంపచెట్లు, తోట చుట్టూ ఉన్న చెట్లు దగ్ధమయ్యాయి. సమీపంలోని ఇళ్లలోకి అగ్ని రవ్వలు ఎగిసిపడటంతో ఒకరి ఇంట్లో వాషింగ్ మెషిన్ కాలిపోయింది. స్థానికుల సమాచారంతో అగ్నిమాపకశాఖ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు.

పేదలకు ఇంటి పట్టాలివ్వాలి



ధర్నా చేస్తున్న నాయకులు

కదిరి టౌన్: పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల పేదలకు మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల వారికి రెండు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చి.. పక్కాగృహాలు నిర్మించి ఇవ్వాలని కోరారు. అనంతరం తహసీల్దార్ మురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లియాఖత్, మధునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి 'నవోదయ'లో సీట్లు



లిఖిత



కె.ఎస్.షాహిద్

కదిరి అర్బన్/ ఓడీచెరువు: లేపాక్షి జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 సంవత్సరానికి గాను ఆరో తరగతి ప్రవేశాలకు జనవరి 18న నిర్వహించిన పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. పలువురు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సీట్లు సాధించారు. కదిరి మండలం వీరేపల్లిపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థి సి.లిఖిత సీటు సాధించడంపై ఎంఈఓలు చెన్నక్రిష్ణ, ఓబుల్‌రెడ్డి, ఉపాధ్యాయులు ప్రభంజన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి అభినందించారు. ఓడీచెరువు మండల కేంద్రంలోని విజ్ఞాన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థి కె.ఎస్.షాహిద్ 'నవోదయకు' ఎంపికైనట్లు విద్యాసంస్థల చైర్మన్ మారాగానికుంట్ల ఫక్రుద్దీన్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తనకల్లు: మల్లిరెడ్డిపల్లి వద్ద నలుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ గోపీ మంగళవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.8,150 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

వాహనాల పట్టివేత



స్వాధీనం చేసుకున్న జేసీబీ, ట్రాక్టర్

బత్తలపల్లి: మండలంలోని చిత్రావతి నదిలో ఇసుకను అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న వాహనాలను పట్టుకుని, పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రామాపురం సమీపంలోని చిత్రావతి నదిలో జేసీబీ సాయంతో ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం అందగానే తమ సిబ్బందితో వెళ్లి దాడి చేసినట్లు తెలిపారు. అక్కడ లోడ్ చేసేందుకు సిద్ధంగా ఉన్న జేసీబీ, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించి రెండు వాహనాలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ నీలకంఠారెడ్డి మంగళవారం ప్రారంభించారు. వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే వారి దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు. దాతలు ముందుకు వచ్చి మండల వ్యాప్తంగా ప్రధాన కేంద్రాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బాలరామాంజనేయులు, ఆర్ఐ కిరణ్, వీఆర్ఓ నజీర్, మానవహక్కుల సంఘం నాయకులు పాపన్నతో పాటు వీఆర్ఓలు పాల్గొన్నారు.

అర్హులకు న్యాయం చేస్తాం



పొలాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ మహేష్

ముదిగుబ్బ: దొరిగిల్లు పొలం సర్వేనంబర్ 1732, 1733, 1734, 1964లో తాము సాగు చేసుకుంటున్న భూములను ఇతరుల పేరిట ఆన్‌లైన్‌లో ఎక్కించారని అడవి బ్రాహ్మణపల్లి తండాకు చెందిన పలువురు రైతులు ఇటీవల ఇటీవల ధర్మవరం ఆర్డీఓ మహేష్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్డీఓ మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఫిర్యాదుదారుల భూములు ఎక్కడున్నాయి.. సర్వే నంబర్లు ఏమిటి ఆరా తీశారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి అర్హులకు న్యాయం చేస్తామని ఆర్డీఓ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణస్వామి, వీఆర్ఓ జయరామిరెడ్డి, సర్వేయర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.